www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 30 మార్చి 2024

5

పశ్చిమ గోదావరి

ఆర్‌ఒ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

600 కుటుంబాలకు రక్షిత తాగునీరు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

3ఎఫ్ ఇండస్ట్రీస్ వారి రామేశ్వర్ బాలకృష్ణ గోయంకా ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో ఆర్‌ఒ వాటర్‌ప్లాంట్ నిర్మించారు. ఈ వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు 3ఎఫ్ ఇండస్ట్రీస్ కో ఆర్డినేటర్ వేమల శ్రీనివాస్, జి.శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (సిఎస్‌ఆర్) తెలిపారు. సుమారు 600 కుటుంబాలకు సురక్షిత తాగునీటిని అందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా జువ్వలపాలెం గ్రామస్తులు 3ఎఫ్ ట్రస్ట్ యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని కోరారు.

కేన్సర్.. కలవరం..!

- రెండు జిల్లాల్లో చాప కింద నీరులా చుట్టేస్తున్న మహమ్మారి
- బ్రెస్ట్, బోన్, పెద్దపేగు, గొంతు, బ్లడ్ కేన్సర్ల బారిన జనం
- ఏలూరు కేన్సర్ ఆసుపత్రిలో ఒపి రోగులు రోజుకు 150కిపైనే
- జనాలకు రోగంపై అవగాహన కల్పనలో ప్రభుత్వాలు విఫలం
- కీమోలకు మాత్రమే ఆరోగ్యశ్రీ, టెస్టుల కింద రూ.50 వేల వరకూ బాదుడు

'పాలకొల్లు సమీప గ్రామానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తికి పెద్దప్రేగు కేన్సర్ బారిన పడ్డారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కేన్సర్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. మందులు, కీమోలు తీసుకున్నా, ఏడాదిన్నర తర్వాత మనిషి దూరమైన పరిస్థితి. కేన్సర్ సోకినట్లు నిర్ధారణయ్యేసరికి రోగం ముదిరిపోయినట్లు చెబుతున్నారు. గ్రామంలో ఉంటూ, ఎటువంటి అనారోగ్య సమస్యలు లేని వ్యక్తికి ఈ కేన్సర్ రావడమేమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు'.

'ఏలూరులోని 45 ఏళ్ల మహిళ రొమ్ము కేన్సర్ బారిన పడింది. ఆదిలోనే గుర్తించడంతో నెలలు తరబడి చికిత్స తీసుకుని అతికష్టంపై బయటపడింది. చికిత్స కాలంలో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అయితే రోగం ఎందుకు వచ్చిందో తెలియదు.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కేన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటం తీవ్రంగా కలవర పెడుతోంది. కేన్సర్‌పై జనాలకు సరైన అవగాహన లేకపోవడంతో రోగం బారిన పడ్డ వ్యక్తులు మృత్యువుకే అన్నట్లు పరిస్థితి తయారైంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా కేన్సర్ రోగం చుట్టుముట్టేస్తోంది. ఏలూరు ప్రాంతంలోని కేన్సర్ ఆసుపత్రికి రోజుకు సరాసరిన 150 మంది అవుట్‌పేషెంట్లుగా, దాదాపు 30 నుంచి 40 మంది ఇన్‌పేషెంట్లుగా రోగులు చేరుతున్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇంకా భీమవరం, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్‌లోని కేన్సర్ ఆసుపత్రులకు జిల్లాలోని రోగులు చికిత్స కోసం పెద్దఎత్తున తరలివెళ్తున్నారు. గతంలో గ్రామాల్లో ఎవరికో ఒకరికి కేన్సర్ వస్తే వింతగా చెప్పుకునేవారు. ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ పెద్దఎత్తున కేన్సర్ రోగులు పెరుగుతున్న పరిస్థితి. ఈ రోగం నిర్ధారణ అయ్యేసరికి పరిస్థితి చేయి దాటిపోతుంది. కేన్సర్‌ను ఎలా గుర్తించాలి, ముందుగా శరీరంలో ఎటువంటి మార్పులు కన్పిస్తాయి వంటి వాటిపై ప్రభుత్వం కనీస అవగాహన సైతం కల్పించడం లేదు. జిల్లాలో ఎక్కువగా రొమ్ము (బ్రెస్ట్), బోన్, పెద్దప్రేగు, గొంతు, బ్లడ్ కేన్సర్ల బారిన పడుతున్నారు. రొమ్ము కేన్సర్ విషయంలో ఆదిలోనే గుర్తించే అవకాశం ఉండటంతో కోలుకుంటున్న వారి శాతం కొంత మెరుగ్గా కన్పిస్తోంది. మిగిలిన కేన్సర్ల బారిన పడితే మాత్రం పరిస్థితి ఏమిటో అర్థం కాకుండా పోతుంది. జిల్లాలో కేన్సర్ రోగం ఇంతవేగంగా విస్తరించడానికి కారణాలు ఏమిటనే విషయంపై ఇప్పటికీ గుర్తించిన పరిస్థితి లేకుండాపోయింది. జీవన విధానంలో మార్పులా.. తినే ఆహారంలో సమస్యా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. కేన్సర్ బారిన పడకుండా ఉండాలంటే ముందస్తు చర్యలు ఏమిటనే అవగాహన సైతం జనాలకు కల్పించే ప్రయత్నం జరగడం లేదు. కేన్సర్ బారిన పడ్డ రోగుల బాధలు వర్ణనాతీతం.

ఆర్థికంగా సామాన్య ప్రజానీకం విలవిల

కేన్సర్ బారిన పడుతున్న సామాన్య ప్రజానీకం పరిస్థితి దుర్భరంగా మారుతోంది. కేన్సర్ రోగులకు కీమో థెరఫీ, కరెంటు పెట్టడం వంటి చికిత్సలు ఆరోగ్యశ్రీలో ఉన్నాయి. అయితే కేన్సర్ గుర్తించేందుకు చేయిస్తున్న టెస్టులు మాత్రం ఆరోగ్యశ్రీలో లేకుండాపోయాయి. దీంతో బోన్‌మారోతోపాటు ఇతర టెస్టులకు పెద్దఎత్తున ఖర్చవుతోంది. కేన్సర్ నిర్థారణయ్యేసరికి టెస్టులు, మందుల కింద కనీసం రూ.50 వేలుపైనే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆ తర్వాత కీమోలకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నారు. దీర్ఘకాలిక రోగం కావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరగడం, మందుల కొనుగోలుకు రూ.వేల్లో ఖర్చవుతోంది. దీంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న, చిరుద్యోగుల కుటుంబాలు ఖర్చు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. కేన్సర్ రోగానికి సంబంధించిన టెస్టులు అన్నింటికీ ఆరోగ్యశ్రీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. అంతేకాకుండా రెండు జిల్లాల్లో కేన్సర్ ఇంత వేగంగా విస్తరించడానికి కారణాలు తెల్సి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సి అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నాడు కౌన్సిలర్లు.. నేడు ఎంపీ అభ్యర్థులు..!

వారిద్దరూ భీమవరం వాసులే.. నాడు కౌన్సిలర్లుగా పని చేశారు.. నేడు ఎంపీ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. వారే నరసాపురం వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ. గతంలో కాంగ్రెస్ నుంచి ఉమాబాల, బిజెపి నుంచి శ్రీనివాస్‌వర్మ ఎన్నికయ్యారు. నాటి నుంచి నేటి వరకు రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న ఈ ఇరువురి మధ్య ప్రధాన పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.

నరసాపురం ఎంపీ స్థానానికి వైసిపి నుంచి గూడూరి ఉమాబాల, బిజెపి నుంచి శ్రీనివాస్‌వర్మ

ఇరువురు గతంలో భీమవరం మున్సిపల్ కౌన్సిలర్లు

రసవత్తరంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఊహించని పరిణామాలకు కేరాఫ్ అడ్రస్ రాజకీయం. ఏ నిమిషంలో ఏమి జరుగుతుందో ఊహించడం ఎవరి తరమూ కాదు. అన్నీ తానే అనుకున్న వారికి రాజకీయాల్లో నిలువ నీడ లేకపోవచ్చు.. ఎవరూ ఊహించని వారిని రాజకీయ పదవులు వరించొచ్చు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానంతో పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలు ఉండగా ప్రస్తుత జిల్లాలో నర్సాపురం మాత్రమే ఏకైక స్థానంగా ఉంది. గతంలో ఈ స్థానానికి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే కాపులు, క్షత్రియులు మాత్రమే తలపడేవారు. ఈ స్థానం నుంచి ఎంపీలుగా పోటీ చేసేందుకు వేరే సామాజిక తరగతికి అవకాశం దక్కలేదు. అయితే తొలిసారి నరసాపురం ఎంపీ స్థానం నుంచి వైసిపి బిసి మహిళ గూడూరి ఉమాబాల రంగంలోకి దిగారు. బిజెపి అభ్యర్థిగా క్షత్రియ సామాజిక తరగతికి చెందిన భూపతిరాజు శ్రీనివాస వర్మ పేరు ఖరారైంది. ఇరువురు అభ్యర్థులు జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలో నరసయ్య అగ్రహారం, చినఅగ్రహారంపాలెం ప్రాంతాలకు చెందినవారే కావడం విశేషం. ఇరువురు ఉన్నత విద్యావంతులు కావడంతోపాటు రాజకీయాల్లో ఆయా పార్టీలో దిగువ స్థాయి నుంచి నాయకత్వ స్థాయికి ఎదిగారు. అయితే ఇరువురు అనూహ్యంగానే టిక్కెట్‌లను దక్కించుకోవడం విశేషం. మరో విశేషం ఏమిటంటే ఇద్దరూ భీమవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కూడా. ఉమాబాల 1995-2000 మధ్యకాలంలో కాంగ్రెస్ తరఫున కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీనివాసవర్మ 2014-2019 మధ్యకాలంలో బిజెపి తరఫున కౌన్సిలర్‌గా పని చేశారు. ఇదిలా ఉంటే భీమవరం మున్సిపాలిటీ నుంచి చట్టసభలకు వెళ్లేందుకు ప్రత్యక్ష ఎన్నికల్లో పలువురు నేతలు గతంలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మున్సిపల్ మాజీ ఛైర్మన్లు బొమ్మిడి నారాయణరావు నరసాపురం అసెంబ్లీ స్థానం నుంచి, తోట సీతారామలక్ష్మి నరసాపురం పార్లమెంటు స్థానం నుంచి టిడిపి తరపున పోటీ చేసి గతంలో ఓటమి పాలయ్యారు. 2009లో ప్రస్తుత బిజెపి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ కూడా పోటీ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అయితే భీమవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కీర్తిశేషులు మెంటే పద్మనాభం, మాజీ ఛైర్‌పర్సన్ తోట సీతారామలక్ష్మి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రస్తుత వైసిపి, బిజెపి అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా పార్లమెంట్‌కు ప్రత్యక్ష ఎన్నిక ద్వారా వెళ్లినవారిగా రికార్డు సృష్టిస్తారు. ఉమాబాల గెలుపొందితే మరో రికార్డు కూడా అవుతుంది. నరసాపురం ఎంపీగా ఎన్నికైన తొలి మహిళగానూ, అందులోనూ బిసి మహిళగాను చరిత్ర సృష్టించనున్నారు. దీంతో నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.

వైసిపి ఎంపీ అభ్యర్థి ఉమాబాల



బిజెపి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ వర్మ

33 శాఖల అధికారులకు పోస్టల్ బ్యాలెట్

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 33 నిత్యావసర సేవల శాఖల అధికారులకు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు త్వరలో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే 33 నిత్యావసర సేవలు అర్హత ఉన్న విభాగాల వివరాలను వెల్లడించిందని తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం 12 డిలను అందుబాటులో ఉంచాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొందని తెలిపారు. జిల్లాలో ఒక నోడల్ అధికారిని కేటాయించినట్లు తెలిపారు. సదరు నోడల్ అధికారి సంబంధిత ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి తెలియజేస్తారని పేర్కొన్నారు. మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు జారీ పొందిన మీడియా ప్రతినిధులు, విద్యుత్ శాఖ, బిఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో.ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్మెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్ల, ఎక్సైజ్ శాఖ, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీస్, అటవీశాఖ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ, పోలీసు, పౌర రక్షణ, హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ (పవర్), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్మెంట్ ఆఫ్ పిడబ్ల్యూడి, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

రూ.6.14 లక్షలు సీజ్

నిడమర్రు సిఐ సుభాష్

వివరాలు వెల్లడిస్తున్న నిడమర్రు సిఐ సుభాష్, పక్కన గణపవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - గణపవరం

వాహన యజమానుల నుంచి ఎటువంటి ఆధారాలు లేని రూ.6,14,700 నగదును సీజ్ చేశామని నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కమిషనర్ సూచనల మేరకు వాహనాల్లో 50 వేల కంటే అదనంగా తీసుకెళ్తే ఆ సొమ్ముకు సంబంధించిన పత్రాలు ఆధారాలు చూపించాలన్నారు. సరిపల్లి హెచ్‌పి బంకు దగ్గర ఉన్న చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా భీమవరం నుంచి గణపవరం వస్తున్న ఇల్ల రవీంద్ర వద్ద నుంచి రూ.1,14,700, వేగేశ్న వెంకట సుబ్బరాజు వద్ద నుంచి రూ.5 లక్షలు మొత్తం 6,14,700 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, ఎఫ్ఎస్‌టి అధికారి టిఎల్ సరస్వతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల చెల్లింపు

పిఎఫ్ఎంఎస్ దగ్గర డిజిటల్ కీ అప్రూవల్ - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకోడేరు

పంచాయతీలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల చెల్లింపునకు మార్గం సుగమం అయ్యింది. అమరావతిలో పిఎఫ్ ఎంఎస్ దగ్గర ఎట్టకేలకు డిజిటల్ కీ అప్రూవల్ అయ్యింది. దీంతో విద్యుత్ బకాయిలు చెల్లించే విధంగా పంచాయతీలు చర్యలు చేపట్టారు. పాలకోడేరు మండలంలో 14 పంచాయతీల్లో రూ. కోటీ 60 లక్షల విద్యుత్ బకాయి పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో పాలకోడేరు, విస్సాకోడేరు, వేంద్ర గ్రామ పంచాయతీలు సుమారు రూ.8 లక్షల 62 వేలు చెల్లించాయి. మిగిలిన పంచాయతీలు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం, పంచాయతీ, సచివాలయ కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీకి కరెంట్ కష్టాలు శీర్షికన ప్రజాశక్తి కథనాన్ని శనివారం ప్రచురించింది. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సుమారు నెల 15 రోజుల నుంచి నిలిచిపోయిన డిజిటల్ కీ సేవలను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టారు. అమరావతిలో పిఎఫ్ ఎంఎస్ వద్ద డిజిటల్ కీని అప్రూవల్ చేసి కింద స్థాయికి పంపించారు. దీంతో సర్పంచులు విద్యుత్ బకాయిల చెల్లింపులకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పెన్నాడ పంచాయతీ రూ.2.17 లక్షలు, గొరగనమూడి రూ.32 వేలు చెల్లించాయి. మిగిలిన పంచాయతీలు కూడా మరో రెండు రోజుల్లో విద్యుత్ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు. శనివారం పంచాయతీ కార్యాలయాలకు విద్యుత్ సేవలను పునరుద్ధస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

కొండేపూడితో అనుబంధం మరువలేనిది

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివ రామరాజు



మహిళలతో మాట్లాడుతున్న శివరామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

తాను ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారీ కొండేపూడి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతోందని, ఈ గ్రామంతో ఉన్న అనుబంధం మరువలేనని ఉండి మాజీ ఎంఎల్ఎ, స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు. కొండేపూడి, రామచంద్రాపురం, వేంద్ర గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజుకు శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన శివరామరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, సహకరించి గెలిపించాలని కోరారు. పదేళ్లపాటు ఎంఎల్ఎగా పనిచేసి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. 20 ఏళ్ల నుంచి టిడిపిలో కొనసాగినప్పటికీ పార్టీ కనీస గౌరవం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, తనకు అవకాశం కల్పించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి వెంకటేశ్వరరావు, భూపతి రాజు రాంబాబు, పద్మనాభం, రామకృష్ణంరాజు, వేణుగోపాల్ రాజు, శ్రీనివాసరాజు, పద్మావతి, రవిరాజు, మన్నె మహంకాళి పాల్గొన్నారు.

రఘు రామకృష్ణంరాజుకు అమరావతి రైతుల మద్దతు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అమరావతి రైతుల పోరాటానికి మద్దతుగా నిలబడిన రఘురామ కృష్ణంరాజుకు ఆయా రైతుల పూర్తి మద్దతు ఉంటుందని అమరావతి జెఎసి కమిటీ తెలిపింది. శుక్రవారం రఘు రామకృష్ణంరాజు నివాసం వద్ద ఆయనను అమరావతి రైతులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల జెఎసి ఇన్విటేషన్ కమిటీ ఛైర్మన్ ఆలూరి యుగంధర్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సైకో పాలనకు వ్యతిరేకంగా రఘు రామకృష్ణంరాజు వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. రఘు రామకృష్ణంరాజును నిర్బంధించి చిత్రహింసలు పెట్టిశ్రీవ ఏమాత్రమూ భయపడకుండా ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి అన్నారు. అటువంటి వ్యక్తికి సీటు ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడే వ్యక్తే చట్ట సభల్లో ఉండాలన్నారు. అమరావతి రైతులకు వెన్నుదన్నుగా ఉన్న రఘు రామ కృష్ణంరాజుకు కూటమి అభ్యర్థిగా సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు

మద్దతు తెలుపుతున్న అమరావతి జెఎసి నేతలు, రైతులు

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన సిఇఒ

సిఇఒకు కంట్రోల్ రూమ్ పనితీరును వివరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఏలూరు విచ్చేశారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. దీనిపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులకు సంబంధించిన వివరాలు కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చేరవేస్తారని, తర్వాత చర్యలు తీసుకుంటారని వివరించారు. అనంతరం సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా ఏ విధంగా వాటిని పరిష్కరిస్తున్నదీ సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై సోషల్ మీడియాను పర్యవేక్షిస్తున్న ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్ మాట్లాడుతూ రాజకీయపరమైన ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపడం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని ఆయన పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జిపిఎస్ విధానం ద్వారా ఆయా వాహనాలు ఎక్కడున్నది, ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును సిఇఒ పరిశీలించారు. అనంతరం ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సిఇఒ సందర్శించారు. ఆయా నివేదికలను నిర్దేశించిన సమయంలో పంపేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి సిఇఒ ముఖేష్‌కుమార్‌మీనాకు వివరించారు. తొలుత సిఇఒ ముఖేష్ కుమార్‌మీనాకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పూలమొక్కలిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, సి-విజిల్ నోడల్ అధికారి ఎన్ఎస్.కృపావరం పాల్గొన్నారు.

ఎన్నికల్లో వెలమలు సహకరించాలి

ఆత్మీయ సమావేశంలో మంత్రి కొట్టు



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంటపాడులో ఎక్కువగా ఉన్న వెలమ సామాజిక తరగతికి చెందిన వారు పార్టీలకతీతంగా తన విజయానికి సహకరించాలని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పెంటపాడులోని దాసరి అప్పారావు స్థలంలో ఏర్పాటు చేసిన వెలమ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీలకతీతంగా ఈ ఎన్నికల్లో తనకు పూర్తి సహకారం అందిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు ముప్పిడి సంపత్‌కుమార్, చెన్నా జనార్దన్, ఎంపిపి దాసరి హైమావతి, ఎంపిటిసి రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం : బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు:వైసిపి ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, హత్యలు చేసేసి వాటిని వేరే వారి ఖాతాలోకి నెట్టేసిన అబద్ధాల జగన్‌ను సాగనంపుదామని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పెంటపాడులో శుక్రవారం నిర్వహించిన జనసేన పల్లెపోరు కార్యక్రమాన్ని కూటమి నాయకులందరూ కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓ అవినీతి తిమింగలం తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, తాను మున్సిపల్ ఛైర్మన్‌గా చేసినప్పుడు ఏదైనా అవినీతి చేసినట్టు నిరూపిస్తే బహిరంగంగా ఉరి వేసుకునేందుకు సిద్ధమని అన్నారు. దీనిపై చర్చించే దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పెంటపాడు పల్లెపోరులో ప్రజల నుంచి ఎక్కువ విన్నపాలు వస్తున్నాయని, పెంటపాడులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి కానీ జగన్నాథపురంలో ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే పెంటపాడులో డ్రెయినేజీ వ్యవస్థను మారుస్తాననీ, తాగునీటి కొరత లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అటు జగన్‌ను, ఇటు కొట్టు సత్యనారాయణను సాగనంపాలన్నారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

నిబంధనలకు విరుద్ధంగా బిల్లు లేకుండా నగదు, బంగారం తరలిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణరాజు అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం నరసాపురం రైల్వే స్టేషన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేశాయి. శుక్రవారం ఉదయం నరసాపురం రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ హుబ్లీ నుంచి వచ్చిన ట్రైన్‌లోని ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. నరసాపురం పట్టణ ఆర్‌పిఎఫ్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియ నిలిపివేయాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి రాజగోపాల్

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పాఠశాలల్లో రేషనలైజేషన్ ప్రక్రియను నిలిపివేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిఒ 117, 128, 60లను అమలు చేయరాదని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఇటువంటి ప్రయోగాలు చేయరాదని పేర్కొన్నారు. ఇప్పటికే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఈ 117 జిఒ ద్వారా రేషనైలేజేషన్ ప్రక్రియ వల్ల 3, 4, 5 తరగతులు సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల 4,250 పాఠశాలలు 1, 2 తరగతులకే పరిమితమై విద్యార్థుల సంఖ్య 20 లోపునకు తగ్గిపోయాయన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోవడం కొన్ని చోట్ల పాఠశాలలు మూసివేసిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం 2,115 మున్సిపల్ పాఠశాలల్లో రూ.4.25 లక్షల విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వీరి భవితవ్యం అస్తవ్యస్తం కానుందని తెలిపారు. తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. క్రమంగా ఉపాధ్యాయ పోస్టులను తగ్గించే ప్రక్రియపై ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న ప్రసాదరాజు

తీర ప్రాంతం అభివృద్ధికి కృషి: ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి మళ్లీ అధికారంలోకొస్తే తీర ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని వేములదీవి ఈస్ట్ గ్రామంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఇంటికే పెన్షన్, బియ్యం, పంపిణీ చేశామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు ముదునూరు కృష్ణంరాజు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, తిరుమాని నాగరాజు, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.



పివిఎల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటరమణ

పివిఎల్‌ను కలిసిన వెంకటరమణ

ప్రజాశక్తి - కాళ్ల

సార్వత్రిక ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో బిసి సంఘాల తరపున విస్తృత ప్రచారం చేసి పివిఎల్.నరసింహరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నౌండ్రు వెంకటరమణ అన్నారు. మండలంలోని పెదఅమిరం వైసిపి కార్యాలయంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌండ్రు వెంకటరమణ, వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనతో పాటు వైసిపి బిసి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారయణ, బిసి సంఘ జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటచార్యులు, బిసి సెల్ జిల్లా కార్యదర్శి గంటా సత్యనారయణా, ఆకివీడు జెడ్‌పిటిసి సభ్యులు యండగండి శ్రీను పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి'

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ఎ.గోపవరం, సిహెచ్.అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని వేములదీవి ఈస్ట్‌లో సంగాని రాంబాబు ఆధ్వర్యంలో జల్లా సందయ్య, వనమాడి కృష్ణంరాజు కుటుంబ సభ్యులు వైసిపిలోకి చేరారు. వారికి చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నేరాలు - ఘోరాలు

మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఉండి

మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 21వ తేదీ రాత్రి 10.30 గంటలకు చెరుకువాడ గ్రామంలోని అలుగులమ్మ జాతరకు పరసా శిరీష తన కుమార్తెను తీసుకెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పండు అనే వ్యక్తి శిరీష కుమార్తెను ఫోన్ నెంబర్ చెప్పాలని ఇబ్బంది పెట్టగా విషయం తెలుసుకున్న శిరీష పండుతో వాగ్వివాదానికి దిగారు. పండు శిరీషపై భౌతికదాడికి పాల్పడ్డాడు. దీనిపై శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

పలుచోట్ల పోలీసుల కవాతు

తాడేపల్లిగూడెంలో...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సిఐ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో పోలీసు సిబ్బంది, కేంద్ర భద్రత బలగాలు కలిసి హౌసింగ్ బోర్డు, కడకట్ల ప్రాంతాల్లో శుక్రవారం కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉండి :ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ అన్నారు. చెరుకువాడ నుంచి ఉండి మెయిన్ సెంటర్ వరకు కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు భరోసా కల్పించి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు మండలంలో

ఉండిలో...

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించి అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పోలీసు వారికి, అధికారులకు ఓటర్లందరూ సహకరించాలని వారు సూచించారు.



సమావేశంలో సుబ్బారాయుడు, నాయకర్

టిడిపి కూటమికి రాష్ట్రాభివృద్ధే ముఖ్యం

జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి నాయకర్, మాజీ మంత్రి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి కూటమికి రాష్ట్రాభివృద్ధే ముఖ్యమనిజనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. నరసాపురం జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం కొత్త నవరసపురం రోడ్డులోని చాగంటి మురళీకృష్ణ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. జనసేన పార్టీ కార్యదర్శి చాంగటి మురళీకృష్ణ(చిన్నా) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేయాల్సి వచ్చిందని పవనకళ్యాణ్ తెలిపారన్నారు. బొమ్మిడి నాయకర్ గెలుపునకు అందరూ కలిసి కృషి చేస్తామన్నారు. తనకు వ్యక్తిగత స్వార్థం లేదన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు ధైర్యంగా పని చేయాలన్నారు. పవన్‌కళ్యాణ్ తనకి జరిగే నష్టం కంటే రాష్ట్రానికి జరిగే లాభం కోసమే ఆలోచించారన్నారు. అందరూ మనస్ఫూర్తిగా పని చేయాలన్నారు. అభ్యర్థి ఎవరనేది కాదని, అందరూ అభ్యర్థులుగా భావించాలన్నారు. పట్టుదలగా, దీక్షగా విజయం వైపు అడుగులు వేయాలన్నారు. బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన తర్వాత చిన్నా మద్దతు తనకు ఉందన్నారు. చిన్నా బాధ్యత తీసుకుని గెలవడానికి కృషి చేయాలన్నారు. కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలోకి రావడంతో నరసాపురంలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ప్రభావం చూపుతుందన్నారు. కొత్తపల్లి సారథ్యంలో, చిన్నా సహకారంతో జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సీసలిలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కోమటిగుంట మాజీ సర్పంచి యలమంచిలి వెంకటరమణ అన్నారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మంతెన నాగాంజనేయులు సీసలిలో తన రొయ్యల షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కోమటిగుంట మాజీ సర్పంచి యలమంచిలి వెంకటరమణ శుక్రవారం ప్రారంభించారు. వేసవికాలంలో రోడ్డున వెళ్లే వారందరికీ తాగునీరు అందించాలని, వారి దాహార్తిని తీర్చాలని కూలింగ్ తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవిలో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బంది పడకూడదని కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశామని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మంతెన నాగాంజనేయులు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోమటిగుంట మాజీ సర్పంచి యలమంచిలి రామాంజనేయులు, పులమంతుల యేసురాజు, పానకాల కృష్ణాంజనేయులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటరమణ

స్వతంత్ర అభ్యర్థిగా గుత్తా లక్ష్మీఫణి

ఆత్మగౌరవం, స్థానికత నినాదంతో బరిలోకి

ఆమె అనుచరులు ప్రకటన

ప్రజాశక్తి - నరసాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గుత్తా (రావూరి) లక్ష్మీఫణి నిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆమె అనుచరులు తెలిపారు. లక్ష్మీఫణి ఆత్మగౌరవం, స్థానికత నినాదంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అధికార వైసిపి అభ్యర్థిగా క్షత్రియ సామాజిక తరగతికి చెందిన సిట్టింగ్ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజుకే టిక్కెట్ కేటాయించింది. టిడిపి కూటమి తరపున జనసేన అభ్యర్థిగా అగ్నికుల క్షత్రియ సామాజిక తరగతికి చెందిన బొమ్మిడి నాయకర్‌కు సీటు దక్కింది. నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన తమ సామాజిక తరగతిని రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. తమ సామాజిక తరగతికి చెందిన ఎవరైనా ఎన్నికల బరిలో నిలిస్తే వారిని గెలిపించుకుంటామని అంతర్గత చర్చలు జరుగుతున్నాయి. ఈ దశలో రావూరి లక్ష్మీఫణి బరిలో నిలుస్తారని వార్తలు బయటకు వస్తుండడంతో ఆ సామాజిక తరగతిలో అంతర్గతంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రావూరి లక్ష్మీఫణి గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పిసిసి మెంబర్‌గా పని చేశారు. వ్యాపార రంగంలోనూ, కొప్పర్రు మేజర్ పంచాయతీ సర్పంచిగా, జిల్లా సర్పంచుల ఛాంబర్ కార్యదర్శిగా విజయవంతంగా పనిచేసి స్వతంత్రంగా వ్యవహరించగల నాయకురాలిగా గుర్తింపు పొందారు. ఆమె ఎన్నికల బరిలోకి దిగితే రాజకీయ సమీకరణాలు మారగలవని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పలుచోట్ల టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తెలుగుదేశంపార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్‌టి.రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి టిడిపి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, నాయకులు మెరగాని నారాయణమ్మ, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం, ఎండి షబీనా, గంధం రాధ, బి.పద్మ, గూడూరి సుబ్బారావు, విజ్జురోతు రాఘవులు, పడమట సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం : టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం నరసాపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి పట్టణ సహాయ కార్యదర్శి తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా జనసేన నరసాపురం నియోజకవర్గ నాయకులు చినిమిది సత్యనారాయణరావు హాజరయ్యారు. తొలుత సీనియర్ ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ



భీమవరం రూరల్ : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీతారామలక్ష్మి

ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తుమ్మలపల్లి వెంకటరమణ, పెమ్మాడి శశి, అధికారి కిరణ్, కె.పద్మ, గుడాల సునీత, బస్వాని నాగమణి పాల్గొన్నారు. నరసాపురం రాయిపేటలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అధ్యక్షతన నిర్వహించారు.

గణపవరం : టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు కూచంపూడి సురేంద్రకుమార్‌రాజు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి కడగళ్ల చిన్న, నాయకులు పల్లి వెంకటేశ్వరరావు, కాపారం చిన్న, పల్లి సతీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని కొడమంచిలి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి చిలుకూరి వీరవెంకటసత్యనారాయణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నే తేజ, బండి వెంకటరమణ, చిలుకూరు చంటి, పట్టాభి రామయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి ఎన్‌టి.రామారావు అని టిడిపి మండలాధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెనుమంట్ర మండలంలోని మార్టేరులోని తేతలి రాజారెడ్డి గెస్ట్ హౌస్ ప్రాంగణంలో టిడిపి జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు సత్తిసాయి ఆదినారాయణరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ సానుబోయిన గోపాలకృష్ణ, వెలగల బులి రామిరెడ్డి, గూడూరు మురళి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, టిడిపి మండలాధ్యక్షులు పరిమి రవికుమార్, పెంటపాడు మండలాధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు

క్రీస్తు మార్గం ప్రతిఒక్కరూ ఆచరించతగినదని రెవ ఫాదర్ అయినపర్తి పీటర్ అన్నారు. మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చి ఫాదర్ పీటర్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిలువలు మోస్తూ ఏసుప్రభు వేషధారణలో గ్రామంలో భారీ ప్రదర్శన చేశారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మోటూరి కుమార్‌రాజా, అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు. మొగల్తూరు పంచాయతీ పాలపర్తివారిపేటలో ఫాదర్ గోడి యోసుబురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు బోధనలను వినిపించారు. డెలిగేట్స్ మైలాబత్తుల శామ్యూల్ జాన్, పాలపర్తి జయరాజు, ఎం.సుభాష్, పి.నవీన్, వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని అన్ని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ గాదిరాజు తిమోతి రాజు మాట్లాడారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, భీమలాపురం, కందరవల్లి, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు.

నరసాపురం : గుడ్ ఫ్రైడే సందర్భంగా నరసాపురంలో 28వ వార్డు కొలివారిమెరక ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు సిలువ సన్నివేశాలను ప్రదర్శిస్తూ క్రైస్తవులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి మిషన్ హైస్కూల్ రోడ్డు, రుస్తుంబాద మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం చర్చి ఫాదర్ టి.బిలాన్‌బాబు మాట్లాడారు. పట్టణంలోని లూథరన్ చర్చి, పలు ప్రార్థన మందిరాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పాలకొల్లు : పట్టణంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆర్‌సిఎం చర్చి ఫాదర్ కిషోర్ ఆధ్వర్యంలో ఏసుప్రభు శిలువను వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ మోశారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడారు.

ప్రజా సంక్షేమానికి, పాలకొల్లు అభివృద్ధికి కృషి

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు నియోజకవర్గ ప్రజలందరినీ నా కుటుంబంగా భావించి ఏ సమయంలో ఆపద, కష్టం వచ్చినా పదేళ్లుగా తోడుగా నిలబడుతూ సేవకునిగా పనిచేస్తున్నానని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని గొల్లవానిచెరువులో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కోవిడ్, వరదలు, తుపాన్ వంటి విపత్కర సమయాల్లో బాధిత ప్రజలతోనే గడిపానన్నారు. ఎన్నికల సమయంలో కనిపించే వైసిపి నాయకుల మాటలను నమ్మవద్దన్నారు. ప్రజల సేవకునిగా పనిచేసే తనకు మరొకసారి అవకాశం ఇస్తే ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతానన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమత్స సాయిరాజు, పెనుమత్స శ్రీనివాసరాజు, జోగి బాలయ్య, జోగి ప్రసాద్, రేగులగడ్డ విష్ణు, కసకుర్తి బుల్లయ్య, సేవ మిత్ర సాధికార యువత సభ్యులు, గ్రామస్తులు, కేతరాజు, కేతా రామకృష్ణ, గెద్దాడ గోపీకృష్ణ, గుడాల ప్రసాద్, గుబ్బల శ్రీరామ్, మునీంద్ర, కౌరు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిమ్మల రామానాయుడు

ఆక్వా రైతులకు అండగా ఉంటా

మాజీ ఎంఎల్ఎ శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

తనను ఎంఎల్ఎగా గెలిపిస్తే ఆక్వా రైతులకు అండగా ఉంటానని ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకటశివరామరాజు అన్నారు. మండలంలోని యండగండి నుంచి ఉనుదుర్రు గ్రామానికి వెళ్లి ఆటో ర్యాలీ నిర్వహించిన శివరామరాజు మాట్లాడుతూ తాను ఎంఎల్ఎగా ఉన్న కాలంలోనే ఆక్వా రైతులకు అన్ని రకాలుగా లబ్ధి చేకూర్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఆక్వా రైతుల తరపున అసెంబ్లీలో పోరాడి ఆక్వా రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రచారంలో బొమ్మిడి నాయకర్

'టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - నరసాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ కోరారు. పట్టణంలోని 27వ వార్డులో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయనతో పాటు ఆమె సతీమణి భారతి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు గ్రామస్తులు జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సమక్షంలో వైసిపి నుంచి జనసేనలో చేరారు. వారందరికీ నాయకర్ శుభాకాంక్షలు తెలిపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, II ADDNL, DISTRICT JUDGE: AT: KHAMMAM

M.A.T.O.P.NO. 318 OF 2022

BETWEEN:-
Sariyam Veeravenkatamma and others
.....Claim Prltitioners
AND
R. Achuthakumar & Others
.....Respondents

To
Respondent No.4
Irapa Rambabu, S/o. Balaiah, Age: Major, Occ: Driver-cum-owner of Auto bearing No, AP 39 TK -3929, R/o. H. No. 8-62, Alligudem, Kukunoor Mandal, Pedaravigudem, West Godavari Dist, A.P. -507114,

Take Notice that the above named Claim Petitioners have filed the above O.P.against the respondents claiming compensation. The above case is stands posted to **18-04-2024** for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble court on **18-04-2024 at about 10-30 A.M.** in person or through an advocate without fail. Failing which the matter will be decided ex-parte against you.

//By order of the Hon'ble court//
28-03-2024
Khammam.

YEGINATI NAGESWAR RAO
Advocate, Khammam
CELL No.98483 68823

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 02/2017 in O.S. 476/2005

బిట్వీన్:
పద్మనాభుని నాగేశ్వరరావు -వాది/ DHR
అండ్
1. మామిడి సత్య వరప్రసాద్
2. మామిడి వెంకటకృష్ణ
-ప్రతివాదులు/ JDRs

పై నెంబరు E.P. గ్రంథములో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 16-04-2024 సం॥రం తేదీన** శ్రీయుత పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. కావలసినవారు సదరు వేలం పాటలో పాల్గొని సదరు ఆస్తిని కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రరీ, ఉంగుటూరు మండలం, నల్లమాడు గ్రామపంచాయతి పరిధిలోని ఆర్.ఎస్. నెం. 103/2ఎ లోని య. 4.34 సెంట్లు ఈ భూమికి హద్దులు.
తూర్పు: గౌతు సత్యనారాయణ భూమి.
దక్షిణం: వడ్లమూడి నరసింహమూర్తి భూమి.
పడమర: కాండేపు సుబ్బారావు భూమి.
ఉత్తరం: సుంకరవల్లి రామచంద్రరావు భూమి.
ఈ హద్దుల మధ్య య. 4.34 సెంట్లు భూమి.
వాది నిమిత్తం: రూ. 4,00,000/-
అమీనా విలువ: రూ. 9,00,000/-

దాసరి ఫణిభూషణ ప్రసాద్
DHr తరపు అడ్వకేట్
వేలంపేట, పెంటపాడు
సెల్: 9849216746
తాడేపల్లిగూడెం
ది. 29-3-2024

గ్రామపంచాయతీ కార్యాలయము, పిన్నమరెడ్డిపల్లి

టెండరు ప్రకటన

ఆర్.సి. నెం./2024 తేది.29-03-2024

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, పిన్నమరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఈ క్రింది షెడ్యూలు దాఖలు రోజువారి పనుల నిమిత్తం అనుభవము గల ఏజెన్సీలు కాంట్రాక్టర్లు/ వ్యక్తుల నుండి ది. 31-03-2024వ తేది మధ్యాహ్నం గం॥ 12.30ల వరకు సీల్డు టెండర్లు ఆహ్వానించడం అయినది. దాఖలైన టెండర్లను అదేరోజు సాయంత్రం గం॥ 03.00 ని॥లకు అప్పటి వరకు వచ్చిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయము పనివేళ యందు తెలుసుకొనవచ్చును. దాఖలైన టెండర్లు ఆమోదించుట లేదా తిరస్కరించుట లేదా రద్దుపరచుటకు గ్రామపంచాయతీ వారికి పూర్తి అధికారము కలదు. ధరావతు చెల్లించని టెండర్లు పరిశీలించబడవు.

నెం.	పనుల వివరములు	పనిచేయవలసిన కాలము	చెల్లించవలసిన ధరావతు
1	ట్యాంకు వాచర్లు ఇద్దరు (02) వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ.500/-లు లేదా హామీ పత్రము
2	స్వీపరు ఒకరు (01) వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ.500/-లు లేదా హామీ పత్రము

గమనిక: 1. అనుభవము బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. నెలవారి చెల్లింపులు గ్రామపంచాయతీ సాధారణ నిధులు లభ్యతలను అనుసరించి చెల్లించబడును. 3. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వ్యక్తి ఒక్కింటికి నెలకు రూ. 8,000/-లు మించకుండా రోజువారీ దామాషా లెక్కన టెండరు దాఖలు చేయవలెను.

సం/- **సిహెచ్.పుల్లారావు,** పంచాయితీ కార్యదర్శి
పిన్నమరెడ్డిపల్లి, ఆగిరిపల్లి మండలం